సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం ၊ 30 ၊ జనవరి ၊ 2023



హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పరిపూర్ణాంద సరస్వతి స్వామి అన్నారు. - 8లో



ఆసక్తిగా కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్

రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో కలెక్టర్ వర్సెస్ ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ఆదివారం ఆసక్తిగా సాగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.90	రూ.168



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 198 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	693	713
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 91.98 కిలోలు



గోరింటాకు మేకప్



ఫంక్షన్‌కు మేకప్ చేస్తున్న బ్యూటీషియన్



- సౌందర్యానికి ప్రాధాన్యత ఇస్తున్న మగువలు
- బ్యూటీపార్లర్, బోటిక్యూలకు క్యూ కడుతున్న అతివలు
- కాలానికి అనుగుణంగా మారుతున్న మహిళల తీరు

అందమే ఆనందం.!

మదనపల్లె సిటీ: అందమైన ప్రేమరాణి చెయ్యి తగిలితే.. సత్తురేకు కూడా స్వర్ణమేలే అన్నాడో సినీకవి. ..ఒకే ఒక లోకం నువ్వే...లోకంలోన అందం నువ్వే అని మరో కవి ఆలపించారు. అందమా.. నీ పేరేమిటి అందమా? బాపూ గీసిన చిత్రమా? అంటూ ఇంకో కవి ప్రశ్నించాడు. అందానికి ఎవరు ఎన్ని అలంకారాలు ఇచ్చినా, ఉపమానాలు చూపినా, అందమె ఆనందం అంటున్నారు మహిళలు. ఇంట్లో చిన్న ఫంక్షన్ ఉన్నా.. బంధుమిత్రుల శుభకార్యాలున్నా అందంగా తయారవుతున్నారు. వేడుకలలో ప్రత్యేకంగా కనిపించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు. కిట్టీ పార్టీల నుంచి పెళ్లిళ్ల వరకు ఏ శుభ కార్యామైనా అతివలదే సందడి. వేడుక ఏదైనా మేకప్ అదరాల్సిందే. మహిళలు మురిసేలా అందానికి ఆధునిక సొబగులు అద్దేందుకు బ్యూటీ పార్లర్లు విస్తరిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో నిశ్చితార్థం మొదలుకొని, ఫొటోషూట్, పెళ్లి తంతు వరకు పెళ్లి కూతురిని తయారు చేసేందుకు బ్యూటీషియన్లతో ముందుగా ఒప్పందం చేసుకుంటున్నారు. బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, కేశాలంకరణ, ఇలా మేకప్ విషయంలో ఎక్కడా రాజీపడటం లేదు. అవుట్‌డోర్ షూట్, పుట్టిన రోజు, నిశ్చితార్థం, పెళ్లి... ఇలా వేడుక ఏదైనా వనితకు ప్రత్యేకమే. ప్రతి శుభ కార్యానికి ముందస్తు వేడుక ఇప్పుడో ట్రెండ్. అప్పటికప్పుడు పార్టీలకు వెళ్లేందుకు తేలికగా తక్కువ సమయంలో పూర్తయ్యే పార్టీ మేకప్‌ను పలువురు మహిళలు ఇష్టపడుతున్నారు. వారి అభిరుచికి అనుగుణంగా బ్యూటీషియన్లు వనితల అందానికి మరింత వన్నె తెస్తున్నారు.

ఊపందుకున్న వ్యాపారం

జిల్లాలో మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేటతో పాటు మండల కేంద్రాల్లో సైతం బ్యూటీ పార్లర్‌లు వెలిశాయి. మదనపల్లెలో బ్రాండెడ్ కంపెనీలు బ్యూటీ పార్లర్‌లు నిర్వహిస్తున్నాయి. పట్టణంలోనే సుమారు 800 వరకు బ్యూటీ పార్లర్‌లు ఉన్నాయి. వీటికి రోజుకు వందల సంఖ్యలో మహిళలు వస్తుంటారు. ప్రతి రోజూ లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. బ్యూటీ పార్లర్లు, బోటిక్‌లపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది ఉపాధి పొందుతున్నారు.

డబ్బు కొద్దీ అలంకరణ

మహిళల ఆసక్తిని, అభిరుచిని గమనించిన బ్యూటీ పార్లర్లలో ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. సింపుల్‌పార్టీ, బ్రైడల్ మేకప్‌లు ఉన్నాయి. అలాగే ఫేషియల్, మానిక్యూర్ అండ్ పెడిక్యూర్, నార్మల్, రికావాక్స్, మేక్‌ఓవర్, గాల్వనిక్, అల్ట్రాసోనిక్, ట్రీట్‌మెంట్, టెంపరరీ, ఐరోనింగ్ తదితర సేవలు అందిస్తున్నారు. సింగిల్, ప్యాకేజ్, హోమ్ సర్వీసెస్ ద్వారా మగువలు వారి అందాన్ని మరింత మెరుగు పరుచుకుంటున్నారు. శరీరతత్వం, మనిషిరంగు, వేడుకను బట్టి వారికి నప్పేలా మేకప్ వేస్తున్నారు. మేకప్‌రకం, వాడే మెటీరియల్‌ను బట్టి రూ.500 మొదలుకుని రూ.6,000 వరకు వసూలు చేస్తున్నారు. బ్రైడల్ ప్యాకేజ్ రూ. 6 నుంచి 8 వేలు వరకు ఖరీదు ఉంటోంది.

ప్రత్యేక ఆఫర్లు

మాఘమాసం కావడంతో బ్యూటీపార్లర్‌లకు మంచి డిమాండ్ ఏర్పడింది. కొంత మంది యువతులు బెంగళూరు నగరంలో బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసుకుని మదనపల్లె పట్టణంలో పార్లర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే పార్లర్‌లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో పాటు స్టూడెంట్స్‌కు రాయితీలు ఇస్తున్నారు.

తళుకు బెళుకులు

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా చీరకు తగ్గట్టు మ్యాచింగ్ జాకెట్లతో సరిపెట్టుకునే మహిళలు నేడు వాటికి సొబగులు అద్ది సీతాకోకచిలుకల్లా మెరిసిపోతున్నారు. అల్లికలు, గాజులు, రంగురాళ్ల తదితర మెటీరియల్‌తో తయారు చేసిన రవికలు ధరించి శుభకార్యాల్లో, ప్రత్యేక సందర్భాల్లో సందడి చేస్తున్నారు. చీర ఖరీదు కన్నా జాకెట్టు కుట్టు కూలీ రెండు, మూడు రెట్లు ఎక్కువగా ఉంటోంది. వీటిల్లో మగ్గం వర్క్, మిషన్ ఎంబ్రాయిడరీ వర్క్, వైల్ డూయింగ్ వర్క్, కట్ వర్క్ ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి. జాకెట్ డిజైన్ వాడిన మెటీరియల్ బట్టి రూ.1000 నుంచి రూ.10,000 వరకు తీసుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



వేడుకలు ఉన్నా లేకపోయినా కొందరు మహిళలు నెలకొకసారి బ్యూటీ పార్లర్లకు వచ్చి ఫేషియల్స్ చేయించుకుంటున్నారు. చాలా మంది ప్యాకేజీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందంగా ఉన్నామనే ఆత్మవిశ్వాసం మహిళల్లో పెరుగుతోంది. మంచి బ్రాండెడ్ మెటీరియల్‌తో మేకప్ చేయించుకోవాలి. యావరేజ్‌గా ఉన్న యువతులు పార్లర్లకు వచ్చి అందాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. -శిల్ప, బ్యూటీషియన్, మదనపల్లె

మార్పులు ఆహ్వానిస్తున్నాం



ట్రెండ్‌ను ఫాలో కావాల్సిందే. కొత్తదనాన్ని ఆస్వాదించాల్సిందే. మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు. అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులను ఆహ్వానిస్తున్నాం. -రేణుక(చిట్టి), సొసైటీకాలనీ, మదనపల్లె

రాజు వెడలె.. రవితేజములలరగ..



విద్యుద్దీప కాంతుల్లో మెరుస్తున్న ఆలయం వద్ద అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

అశ్వవాహనంపై కడపరాయుడి శోభ

కడప కల్చరల్ : దుష్ట సంహారం చేసేందుకు ఆయన ఖడ్గం చేతబూనాడు. ఉత్తమ అశ్వంపై ఉరకలేస్తున్న సమరోత్సాహంతో వేటకు బయలుదేరాడు. ఆ వీర గంభీర రూపం శత్రువులకు చూడగానే దడపుట్టించేలా ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ఇన్స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు మచ్చాశేషాచార్యులు, కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణమూర్తి, పార్థసారథి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవను నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామిని ఊయలలో ఉంచి శయనింపు గీతాలను ఆలపించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గీతాలాపనలు చేశారు. రాత్రి అశ్వవాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఆ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పూజా ద్రవ్యాలు సమర్పించారు.





సర్వభూపాల వాహనంపై కడప రాయుని గ్రామోత్సవం, కళాకారుల కోలాట ప్రదర్శనలు

గండికోటలో కమలహాసన్



బ్రిటిషు అధికారి వేషంలో నటుడు



అభిమానులకు అభివాదం చేస్తున్న కమలహాసన్

జమ్మలమడుగు: గండికోటలో భారతీయుడు-2 షూటింగ్ కోసం ప్రముఖ నటుడు కమలహాసన్ పర్యాటక కేంద్రమైన గండికోటకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం సినిమా షూటింగ్‌లో పాల్గొంటారని ప్రచారం జరగడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అభిమానులు తరలివచ్చారు. ఈసందర్భంగా అభిమానులకు ఆయన అభివాదం చేశారు.గండికోటలో వారం రోజుల పాటు దర్శకుడు శంకర్ ఆధ్వర్యంలో షూటింగ్ జరగనుంది. షూటింగ్ కోసం బ్రిటిషు కాలం నాటి పరిస్థితులకు అనుగుణంగా పురాతన వాహనాలు తీసుకురావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నటులు బ్రిటిషు వారి వేషాల్లో చుట్టుపక్కల సంచరిస్తుండటంతో ప్రజలు వారితో ఫోటోల కోసం ఎగబడ్డారు.

కడప, చెన్నై గ్యాంగుల ఆట కట్టిస్తాం

- బెంగళూరు కేంద్రంగా కడప గ్యాంగ్ స్మగ్లింగ్
- ఇంటి దొంగలపైనా నిఘా ఉంచాం
- మదనపల్లెలో డైనమిక్ చెక్‌పోస్టు
- డీఎఫ్‌ఓ పళణి వివేక్



ప్రకృతి అధ్యయన కేంద్రం వద్ద మానస సరోవరం పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ వివేక్

బి.కొత్తకోట: ఎర్ర చందనం అక్రమ రవాణాలో కడప, చెన్నైకి చెందిన మూడు గ్యాంగులు కీలకంగా పనిచేస్తున్నాయని, వీరి ఆట కట్టించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని రాజంపేట డీఎఫ్ఓ పళణి వివేక్ తెలిపారు. ఆదివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీ సముదాయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు, చిన్నచిన్న దొంగలపై ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం ఉండదని, స్మగ్లింగ్ సూత్రధారుల ఆట కట్టిస్తే అక్రమ రవాణా అరికట్టే అవకాశం ఉందన్నారు. కడపకు చెందిన ఓ ప్రధాన స్మగ్లర్, అతని సోదరులు, కుటుంబీకులు బెంగళూరు కేంద్రంగా ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్నారన్నారు. అలాగే చెన్నైకి చెందిన రెండు గ్యాంగులు స్మగ్లింగ్ కార్యకలాపాలు జోరుగా సాగిస్తున్నాయని చెప్పారు. వీటిని అణచివేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాజంపేట, కడప నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి చెన్నైకు ఎర్ర చందనం తరలిస్తున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. స్మగ్లింగ్ అడ్డుకునేందుకు రాయచోటిలో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. స్మగ్లింగ్ నిరోధానికి అవసరమైన అటవీ సిబ్బందిని పెంచుతామని తెలిపారు. జిల్లాలో 8 చోట్ల చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ఏ చెక్‌పోస్టులో సిబ్బంది ఎలా విధులు నిర్వహిస్తున్నారు, వాహనాల తనిఖీ సక్రమంగా చేస్తున్నారా లేదా, తనిఖీ చేయకుండానే వాహనాలను పంపేస్తున్నారా అని పరిశీలన చేస్తున్నామని చెప్పారు. కర్ణాటక సరిహద్దు ఎక్కువగా ఉండటంతో నిఘా తగ్గిందని, మదనపల్లెలో డైనమిక్ చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని చెప్పారు. బాలాయపల్లె చెక్‌పోస్టును మదనపల్లె-కర్ణాటక సరిహద్దుకు తరలిస్తామన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు సహకరిస్తున్న ఇంటి దొంగలపై ఇప్పటికే నిఘా ఉంచామని, ఎవరెవరు సహకరిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని 8 రేంజిల పరిధిలో మొక్కల పెంపకం పనులు పూర్తి చేశామన్నారు. ఒక్కో రేంజిలో 35 హెక్టార్లలో మొక్కలు నాటామన్నారు. ఎస్ఆర్ పాళెంలో నగర వనం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులు మంజూరు చేసిందని, వీటి పనులు చేపట్టనున్నట్టు వివరించారు.

హార్సిలీహిల్స్‌పై ఫ్లోటింగ్ రెస్టారెంట్

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని మానస సరోవరంలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ (తేలియాడే రెస్టారెంట్) ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ రాజంపేట డివిజనల్ అధికారి పళణి వివేక్ తెలిపారు. ఆదివారం ఆయన హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ అతిథి గృహాలను పరిశీలించి వాటి ఆధునికీకరణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి అధ్యయన కేంద్రంలో ఎడ్యుకేషన్-నేచర్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.15లక్షలతో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపడతామన్నారు. జంతుప్రదర్శనశాల, మొసళ్ల పార్కు, కాఫీ తోటను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌ఓ మదన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు కడప జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. ఈ విషయాన్ని సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయరామరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు. అందువల్ల జెడ్పీ సభ్యులుతప్పక సమావేశానికి హాజరు కావాలని కోరారు. అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

కోనరాజుపల్లె వద్ద వెలుగు చూసిన శాసనం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా కోనరాజుపల్లె సమీపంలోగల అడవిలో శాసనం వెలుగు చూసింది. అర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి కె.ప్రసాద్, ఒంటిమిట్ట అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌తో కలిసి ఈ శాసనాన్ని గుర్తించారు. కేంద్ర పురావస్తుశాఖ ఎపిగ్రఫీ విభాగం డైరెక్టర్ ఆచార్య మునిరత్నంరెడ్డి దీనిని పరిశీలించారు. తెలుగుభాషలో ఉన్న శాసనం 1572 జూన్ 12 బుధవారం నాడు వేసినట్లు అందులో పొందుపరిచారన్నారు. కోనరాజుపల్లెలోని శ్రీరామ ఆలయంలో ప్రసాద వితరణ కోసం భూమిని స్వాధీనం చేసిన వివరాలు ఇందులో ఉన్నాయని, మహామండలేశ్వర మాదిరాజు నాగరామోజ దేవ మహారాజు ఈ శాసనాన్ని వేయించినట్లు తెలుస్తోందన్నారు.

అంగన్‌వాడీలలో స్మార్ట్ సేవలు

- జిల్లాలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలు
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు
- కేంద్రాలలో సాంకేతికత మేళవింపు





రాయచోటి: క్షేత్రస్థాయిలో ప్రీ ప్రైమరీ విద్యను అందించే అంగన్ వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు సెల్ ఫోన్లను అందిస్తున్నారు. జిల్లాలో 2275 అంగన్ వాడీ కేంద్రాలు ఉండగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు 1,10, 624 మంది లబ్ధి పొందుతున్నారు. వీరికి సమకూర్చే పౌష్టికాహారం, ఆరోగ్య రక్షణ, పారిశుధ్యం, తాగు నీరు తదితర మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించారు. త్వరలో అధికారికంగా స్మార్ట్ ఫోన్ల సేవల కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో ఇలా...

జిల్లాలో 2275 అంగన్ వాడీ కేంద్రాలు, 9 అంగన్ వాడీ ప్రాజెక్టులు, 1858 ప్రధాన కేంద్రాలు, 417 మినీ కేంద్రాలు ఉన్నాయి. 80 మంది సూపర్ వైజర్లు, 2188 మంది అంగన్ వాడీ కార్యకర్తలు ఉండగా వీరిలో 2275 మంది సిబ్బంది స్మార్ట్ ఫోన్లను పొందారు. అలాగే 11052 మంది గర్భిణులు సేవలు పొందుతున్నారు. 3 నెలల నుంచి 7 ఏళ్ల పిల్లలున్న బాలింతలు 11275 మంది ఉన్నారు. అలాగే 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల పిల్లలు 52579 కలిపి మొత్తం లబ్ధిదారులు 35,718 మంది ఉన్నారు.

పారదర్శక సేవలకే యాప్‌లు..

కేంద్రాలలో పనితీరు మెరుగు, నిరంతర పర్యవేక్షణ కోసం స్మార్ట్ ఫోన్లు అందించారు. వీటి సాయంతో పారదర్శకమైన సేవలు అందించే అవకాశం ఉంది. ఈ ఫోన్‌లో ఇప్పటికే రెండు యాప్‌లు అనుసంధానం చేసి వాటి ద్వారా రోజువారి విధులు పర్యవేక్షిస్తున్నారు. మరో నాలుగు యాప్‌లు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. శానిటేషన్ యాప్‌లో అంగన్ వాడీ కేంద్రం, పరిసరాల పరిశుభ్రత వివరాలు నమోదు చేయాలి. మధ్యాహ్న భోజన నిర్వహణకు హాట్ కుక్ యాప్ అందుబాటులోకి రానుంది. కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు మరుగుదొడ్ల వినియోగించుకునేందుకు నీరు అందుబాటులో ఉంచాలి. లేని పక్షంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తే ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులకు చేరుతుంది. ఆ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. లబ్ధిదారులకు అందించే గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి రానుంది.

పౌష్టికాహారంపై శ్రద్ధ..

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మధ్యాహ్న భోజనంతోపాటు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, ఖర్జూరం, బెల్లం చిక్కీలతో కూడిన కిట్లను సరఫరా చేస్తున్నారు. పౌష్టికాహారం పంపిణీ పటిష్టంగా అమలు చేసేందుకు రెండు ప్రత్యేక యాప్‌లు రూపొందిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ



ప్రభుత్వం అంగన్‌వాడీలకు అందించిన స్మార్ట్ ఫోన్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టేందుకు వెసులుబాటు ఏర్పడింది. రోజువారీ వివరాలు సెక్టార్ల వారిగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు వారికి అందించే పౌష్టికాహారం, నెలవారి రిపోర్టులను ఎప్పటికప్పుడు కార్యకర్తల ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. -కె.చంద్రకాంత, ఐసీడీఎస్ సూపర్ వైజర్, బొమ్మన చెరువు సెక్టార్

పక్కాగా పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనంతోపాటు కోడిగుడ్లు తదితర పౌష్టికాహారాన్ని అందజేస్తారు. వీటి వివరాలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ ట్రాక్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారుల హాజరు, గృహ సందర్శన కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐరన్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు స్మార్ట్ ఫోన్ల విధానం ఎంతగానో దోహదపడుతుంది. -సరస్వతి, సూపర్ వైజర్ రాయచోటి-2 సెక్టార్, అన్నమయ్య జిల్లా

తక్షణమే చర్యలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశాం. తద్వారా చిన్న పొరపాటు నెలకొన్నా తక్షణ చర్యలకు ఆస్కారం ఏర్పడింది. ప్రస్తుతం కార్యకర్తలు పోషణ ట్రాక్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లను వినియోగిస్తున్నారు. వీటిలో పౌష్టికాహారం వివరాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, పాలు, భోజనం పంపిణీ తదితర అంశాలను నమోదు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్లు అందించడం ద్వారా కేంద్రాలలో సాంకేతికత వచ్చి చేరింది. దీంతో పర్యవేక్షణ మరింత సులభమైంది. -పి.రాజమ్మ, సీడీపీఓ, అన్నమయ్య జిల్లా

సేవలు పారదర్శకం



జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలలో పారదర్శకమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లకు స్మార్ట్ ఫోన్లను అందించింది. అంగన్ వాడీ కేంద్రాలలో అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు అనేక సేవా కార్యక్రమాలను పొందుపరచాల్సి ఉంటుంది. -గిరీషా పీఎస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

సాంకేతిక లోపంతో నిలిచిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్

మదనపల్లె : ధర్మవరం నుంచి నర్సాపూర్ వెళుతున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 17248) ఆదివారం సాయంత్రం సాంకేతిక కారణాలతో మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని సీటీఎం రైల్వేగేట్ వద్ద నిలిచిపోయింది. సాయంత్రం 4.14 గంటలకు మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలు 4.16కు స్టేషన్ నుంచి బయలుదేరిన నిమిషాల వ్యవధిలోనే గేటు వద్ద సిగ్నల్ లోపంతో ఆగి పోయింది. తర్వాత రైల్వేసిబ్బంది, అధికారులు సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో సాయంత్రం 6.16 గంటలకు బయలు దేరింది. దాదాపుగా గంటన్నరకు పైగా రైలు ఆగిపోవడంతో ప్రయాణికులతోపాటు రైల్వే గేట్‌కు ఇరువైపులా నిలిచిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండువైపులా కిలోమీటరుకు పైగా వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

ఆటోలు ఢీకొని వ్యక్తి మృతి


సుబ్బరాయుడు (ఫైల్)

సంబేపల్లె : మండలంలోని శెటిపల్లె సమీపంలో ఆదివారం రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ బుర్రవాండ్లపల్లెకు చెందిన గోపగాని సుబ్బరాయుడు (42) ఇంటి నిర్మాణపు సామగ్రితో బుర్రవాండ్లపల్లె నుంచి ఆటోలో శెట్టిపల్లె కస్పాకు బయలుదేరాడు. శెట్టిపల్లె వైపు నుంచి వస్తున్న మరో ఆటో (నాలుగు చక్రాల వాహనం) ఢీకొంది. ఈ రెండు వాహనాలు శెటిపల్లె సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి యజమాని మృతి చెందడంతో భార్య మల్లమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

కారును ఢీకొన్న లారీ

భార్యాభర్తలకు స్వల్ప గాయాలు


దెబ్బతిన్న కారు

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు స్వల్ప గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన భార్యాభర్తలు సతీష్, భాగ్యలక్ష్మీ కారులో చెన్నై నుంచి విజయవాడకు వెళ్తుండగా.. మండల పరిధిలో దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆసక్తిగా కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్


ఫీల్డింగ్‌లో బాల్‌ను త్రో చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్


అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డికి టోపీ అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ


బ్యాట్ పట్టి ఆట ఆడటానికి వస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

- 20 ఓవర్లలో 173 పరుగులు చేసిన కలెక్టర్ టీం
- 160 పరుగులు సాధించి ఓటమి చెందిన ఎస్పీ టీం
- బ్యాటింగ్ చేసి ఆకట్టుకున్న కలెక్టర్, ఎస్పీలు

రాయచోటి : రాయచోటిలోని పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ వర్సెస్ ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ఆదివారం ఆసక్తిగా సాగింది. కలెక్టర్ టీంకు కలెక్టర్, ఎస్పీ టీంకు ఎస్పీ కెప్టెన్‌లుగా వ్యవహరించారు. టాస్ గెలిచిన కలెక్టర్ టీం బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 173 పరుగులు సాధించింది. ఇందులో కలెక్టర్ ఒంటి చేత్తో బ్యాటింగ్ చేపట్టి 10 పరుగులు చేసి ఆకట్టుకున్నారు. కలెక్టర్ గన్‌మెన్ శ్రీనివాసులు 12 బంతుల్లో 34 పరుగులు చేసి జట్టు విజయానికి బాటలు వేశారు. 174 పరుగుల లక్ష్యంతో ఎస్పీ టీం బరిలోకి దిగింది. 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు సాధించి 13 రన్‌ల తేడాతో ఓటమి చవిచూసింది. ఇందులో ఎస్పీ బ్యాటింగ్ చేసి 23 రన్‌లు కొట్టి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అత్యధికంగా ఎస్పీ గన్‌మెన్ నాగశివ 55 రన్‌లు కొట్టాడు. ఆట సమయంలో బౌలింగ్ ప్రక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో పకడ్బందీగా సాగింది. కలెక్టర్ టీంకు ఎస్పీ అభినందనలు తెలిపారు. అంతకుముందు రెండు జట్లలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు, టోపీలను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టర్ వర్సెస్ ఎస్పీ టీం మధ్య క్రికెట్ మ్యాచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో ఉండే అధికారులు, పోలీసులకు క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. క్రికెట్ పోటీలు నిర్వహించడానికి ఎస్పీ ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. మైదానాన్ని ఎస్పీ చాలా చక్కగా తయారు చేయించారన్నారు. అప్పుడప్పుడు క్రికెట్ ఆడటం వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప

రన్నర్‌గా వైజాగ్ జట్టు


ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న కడప-వైజాగ్ జట్లు


క్రీడాకారులతో సీఐ, టోర్నమెంట్ నిర్వాహకులు

ఎర్రగుంట్ల : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప, రన్నర్‌గా వైజాగ్ జట్లు నిలిచాయి. ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 66వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం సాయంత్రం వరకు టోర్నమెంట్ జరిగింది. ఫైనల్స్‌లో బాలబాలికల విభాగాల్లో కడప, వైజాగ్ జట్లు పోటీ పడ్డాయి. రెండు విభాగాల్లోనూ కడప జట్లు విజేతగా, వైజాగ్ జట్లు రన్నర్స్‌గా నిలిచాయి. దీంతో టోర్నీ విజేతగా కడప జట్టును ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 520 మంది క్రీడాకారులు, 30 మంది దాకా కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంట్ అబ్జర్వర్ ప్రభాకర్, పారిశ్రామికవేత్త టి. పవన్‌కుమార్‌రెడ్డి, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి. శివశంకర్‌రెడ్డి తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ తిరుపాల్‌రెడ్డి, ఫుట్‌బాల్ స్టేట్ సెలక్షన్ కమిటీ మెంబర్ ఉస్సేన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలో కదిరికి వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డులో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అయనను వెంటనే స్థానికులు 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

వాల్మీకిపురం : వాల్మీకిపురం పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతపర్తి పంచాయతీ తూర్పుపల్లికి చెందిన రెడ్డెప్ప కుమారుడు రమేష్ (42) వాల్మీకిపురంలోని తిరుపతి రోడ్డులో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య శారద, ముగ్గురు సంతానం ఉన్నారు. జీవితంపై విరక్తి చెంది ఉదయం ఇంట్లోని పడకగది పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. ఎంత సేపటికీ గది తలుపులు తెరవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లారు. రమేష్ విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై బిందుమాధవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్రాస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జమ్మలమడుగు మండల పరిధిలోని కన్నెలూరుకు చెందిన శైలాష్ (46) కడపలోని శంకర్‌రెడ్డి వీధిలో నివాసం ఉంటూ, డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నారు. ఆదివారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న శైలాష్‌ను గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయనను రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి కుమార్తె తబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి


మాట్లాడుతున్న శ్రీ పరిపూర్ణానంద సరస్వతి

మదనపల్లె సిటీ : హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామి అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. భక్తులనుద్దేశించి ఆయన అనుగ్రహభాషణ చేశారు. మన సంస్కృతిని భావితరాలకు అందించాలని కోరారు. హిందూ సమాజం ఈనాటిది కాదన్నారు. వెయ్యేళ్ల నుంచి భారతదేశం వివిధ వర్గాల దాడులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎన్ని దాడులు జరిగినా, చేసిన వారంతా కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. భారతమాత ఎంతో గొప్పదని, అమ్మ గొప్పతనాన్ని ఉదాహరణలతో వివరించారు. దేవాలయాలు, దేవతలను నాస్తికులు విమర్శించడం శోచనీయమన్నారు. వారికి తగిన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల అయ్యప్పస్వామిని విమర్శించడంపై ఖండించారు. మదనపల్లె ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశమన్నారు. చుట్టూ కొండలు, లోయలు ఉన్నాయన్నారు. ఇలాంటి ప్రదేశంలో మహనీయులు పుట్టినట్లు తెలిపారు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి జన్మించిన మదనపల్లెను మరచిపోలేమన్నారు. ఇలాంటి పట్టణంలో హిందూ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశరక్షణ కోసం, ధర్మ రక్షణ కోసం యాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీ.టీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, ప్రసాదరావు, ఏవీ సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, డాక్టర్ నవీన్, గురు శంకర్, శ్రీనివాసరావు, బండి ఆనంద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణకుంభంతో స్వాగతం

శ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామికి వేదపండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బహుళ సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు


వర్చువల్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సహకార శిక్షణ కేంద్ర డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప

కడప అగ్రికల్చర్ : భారతదేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌ల)ను బహుళ సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దుటకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సహకార మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని సహకార శిక్షణ కేంద్ర డిప్యూటీ రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ గుర్రప్ప పేర్కొన్నారు. తద్వారా రైతు సభ్యులకు రుణపరపతి సౌకర్యంతో పాటు అన్ని సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆదివారం వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని పీఏసీఎస్ సంఘాల ముఖ్య కార్య నిర్వాహణాధికారులకు ఆయన వర్చువల్ పద్ధతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పీఏసీఎస్ సంఘాలు చేస్తున్న స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలతోపాటు ఎరువుల వ్యాపారం, విత్తనోత్పత్తి కేంద్రాలు, పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ కేంద్రాలు నిర్వహించుకొనుటకు వీలుగా బైలా కల్పిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకలు పెంపకం, చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమ, శీతల గిడ్డంగుల, ఆహార ధాన్యాల సేకరణ, పూలతోటలు, తేనెటీగల పెంపకంతోపాటు పట్టు ఉత్పత్తి ప్రోత్సాహాన్ని పీఏసీఎస్‌లు చేయటకు వీలు కలుగుతుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘాలతో కంప్యూటీకరణ, డిజిటలైజేషన్ విధానం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని పీఏసీఎస్ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహణ అధికారులు పాల్గొన్నారు.

జేఎల్ఎం గ్రేడ్–2లను ఒకే శాఖ కిందకు తీసుకురావాలి

గ్రామ/వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్


మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జేఎల్ఎం గ్రేడ్–2లను ఒకే శాఖ పాలన కిందికి కేటాయించి పని చేయించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్–2లు గ్రామ/వార్డు సచివాలయ, విద్యుత్ అధికారుల మధ్య నలిగిపోతున్నారన్నారు. కింది స్థాయిలో ఎంపీడీఓలు బయోమెట్రిక్‌ను ఆఫీస్ వేళల్లో వేయాలని హుకుం జారీ చేయడమే కాకుండా కొన్ని చోట్ల తాము చెప్పిన పనినే చేయాలని కూడా ఆదేశిస్తున్నారని, లేదంటే షోకాజ్ నోటీసులు ఇస్తామనడం సరికాదన్నారు. ఇలా రెండు శాఖల మధ్య జేఎల్ఎం గ్రేడ్–2లు పనిఒత్తిడితో నలిగిపోతున్నారన్నారు. విద్యుత్ సంస్థ సర్వీస్ రూల్స్ ప్రకారం 24 గంటలు పని చేయించుకుంటూ గ్రేడ్–2లు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 100 మందికిపైగా జేఎల్ఎం గ్రేడ్–2లు మరణించారని, 200 మందికిపైగా అంగవైకల్యం చెందారన్నారు. రాష్ట్ర కార్యదర్శి మంజునాథ మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్–2లను విద్యుత్ సంస్థల పర్యవేక్షణలో కాకుండా గ్రామ, వార్డు సచివాలయ పర్యవేక్షణలో పని చేసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 కింద వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సు. దీర్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి, మునెయ్య, రమణరాజు, రెడ్డిరాజు, కృపాకర్, శ్యామ్, మల్లికార్జున, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి.. డ్రైవర్‌కు గాయాలు


పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

చెన్నూరు : కడప-తిరుపతి బైపాస్ రోడ్డులోని డీఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎర్రగుంట్ల నుంచి కడపకు రాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను పొట్టుతో వెళ్తున్న లారీ క్రాస్ చేయబోయింది. పొట్టు బస్తా ట్రాక్టర్‌కి తగిలి.. లారీలోని పొట్టు ట్రాక్టర్ డ్రైవర్ మీద పడింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్ర మాదంలో ట్రాక్టర్ డ్రైవర్ కుళ్లాయప్పకు గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి గురుకులం పోటీలు ప్రారంభం


క్రీడాకారుల విన్యాసం


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సింహాచలం(విశాఖపట్టణం) : మహాత్మా జ్యోతి బాపూలే వెనుబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గురుకుల పాఠశాలల క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్టణం జిల్లాలోని సింహాచలంలో గురుకుల పాఠశాల వేదికగా ఈ పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోని బీసీ గురుకుల పాఠశాలల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా ఈ పోటీలను ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 102 బీసీ గురుకులాల్లో 35 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యా విషయాల్లోనే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. తొలుత జిల్లాల వారీగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఇక్కడ 12 రకాల స్పోర్ట్స్, 8 రకాల గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సింహాచలం గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 20 మంది రిఫరీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. వందన సమర్పణను విశేషంగా క్రీడాకారులు నిర్వహించారు.

ఉత్సాహంగా తొలిరోజు పోటీలు

తొలి రోజు జరిగిన 800 మీటర్ల పరుగు పోటీలో బాలుర విభాగంలో బి.ప్రశాంత్(చిత్తూరు), టి.యుగంధర్(శ్రీకాకుళం), వి.మణికంఠ కుమార్(నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 800 మీటర్ల బాలికల విభాగంలో బి.శ్రీవాణి(కర్నూల్), బి.హర్షిత(శ్రీకాకుళం), జి.భవ్యశ్రీ(అనంతపురం) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగాయి.